క్లుప్తంగా

హ్యాండ్‌బాల్ పోటీలకు గుడిలోవ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆనందపురం : మండలంలోని గుడిలోవలో ఉన్న విజ్ఞాన్ విహార్ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికై నట్టు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గోపీకృష్ణ తెలిపారు. ఈ నెల 3న నగరంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎస్‌వీఎస్ విజయ్, సీహెచ్ లోహిత్, వై.రామదీక్షిత్, ఆర్.ప్రణయ్, జి.నవదీప్ ఎంపికయ్యారు. వారు ఈ నెల 8, 9, 10న తెనాలిలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ మేరకు విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

ఆనందపురం : కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి కంటుభుక్త రామానాయుడు కోరారు. మండలంలోని వేములవలసలో సోమవారం భారత్ వికసిత్ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఉజ్వల గ్యాస్ పథకం, అంత్యోదయ అన్న యోజన, బీమా యోజన, పీఎంఏవై వంటి పథకాలను వివరించారు. ఈ సందర్భంగా భారతదేశ ఔన్నత్యానికి కృషి చేస్తామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అడపా లవరాజు, ఈవోపీఆర్డీ కెల్ల రామారావు, కార్యదర్శి నరిసింగరావు, నాయకులు మీసాల రామునాయడు, కోరాడ రాంబాబు, కోరాడ అప్పలస్వామి నాయుడు, బండారు అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నసంతర్పణకు వైఎస్సార్ సీపీ నాయకుల సాయం



అన్నసంతర్పణ ప్రారంభిస్తున్న నాయకులు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు దుర్గాలమ్మ అయ్యప్ప పీఠంలో నిత్యాన్నదానంలో భాగంగా అన్నసంతర్పణను వైఎస్సార్ సీపీ భీమిలి ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్ సోమవారం ప్రారంభించారు. ఇందుకోసం జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యురాలు కొప్పల ప్రభావతి, రమేష్ ధన సహాయం చేశారు. 900 మంది మాలధారులు భిక్ష స్వీకరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జగుపల్లి ప్రసాద్, కొప్పల కృష్ణ, పందిరి విజయ్, గిడుతూరి మురళి, గురుస్వాములు దొంతల పైడిరాజు, కుమిలి తిరుపతిరావు, స్థానిక పెద్దలు కోసూరి రాంబాబు, దుర్గాసి గురునాథ్, బెవర సాయి, తెడ్లాపు చంటి, కోసూరి మురళి, తమ్మిన వెంకటరమణ, ఏలూరి శంకర్, పుట్ట వెంకటరావు, పాలకుర్తి రాజేంద్ర, తిరుమలనాయుడు, మాల్యాద్రి, మాదాబత్తుల వెంకట అప్పారావు, మోటూరు సత్యనారాయణ పాల్గొన్నారు.

- భీమిలి మండలం లక్ష్మీపురం శ్రీఅయ్యప్ప స్వామి సేవా పీఠంలో అన్నసంతర్పణకు వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు ఆర్థిక సాయం చేశారు. టి.నగరపాలెం అభయ ఆంజనేయస్వామి ఆలయ 11వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వాహకులు అన్నదానం చేశారు.

గాడు శ్రీను ఆర్థిక సహకారంతో...



అన్నసంతర్పణలో గాడు శ్రీను, తదితరులు

పద్మనాభం: మండలంలోని మద్ది గ్రామంలో గల శ్రీ ధర్మ శాస్త్ర సేవా పీఠంలో వైఎస్సార్ సీపీ భీమిలి మండల రూరల్ అధ్యక్షుడు గాడు శ్రీను ఆర్థిక సహకారంతో సోమవారం అన్నసంతర్పణ చేశారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, ఎంపీటీసీ సభ్యురాలు కంటుబోతు తులసి లక్ష్మి, గాడు శ్రీను కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అన్నదాతల్లో ఆందోళన

- మిచాంగ్ తుపానుతో అలజడి
- వర్షానికి తడుస్తున్న వరిపనలు
- ఈదురు గాలులకు నేలకొరిగిన పంట



గాలులకు వాలిపోయిన వరిపంట



కుసులువాడలో పొలంపైనే ఉన్న వరి పనలు

ఆనందపురం : వ్యయ ప్రయాసల కోర్చి ఆరుగాలం కష్టించి వేలాది రూపాయల పెట్టుబడులతో కంటికి రెప్పలా కాపాడుకున్న వరిపంట చేతికొచ్చే దశలో తుపాను ప్రభావంతో అన్నదాతల గుండెల్లో గుబులు రేగుతోంది. వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికలు చేసినా అప్పటికే కోతలు జరిగిన ప్రాంతాల్లో వరి పనలు నేలపైనే ఉండిపోయాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి ఒక మోస్తారు వర్షం కురుస్తుండడంతో వరి పనలు తడిచి పోతున్నాయి. అలాగే కోయకుండా ఉన్న వరిపంట ఈదురు గాలులకు నేలకొరుగుతోంది. తుపాను మంగళవారం నాటికి మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారుతుందని వాతావరణ శాఖ వెల్లడిస్తుండడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో 1200 హెక్టార్లలో వరి సాగవుతోంది. సగానికి పైబడి వరి పంటను వర్షాల పైనే ఆధారపడి సాగు చేస్తున్నారు. ఈ ఏడాది దిగుబడి కూడా ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఎంతో సంబరపడ్డారు. కానీ రైతుల ఆశలు అడియాశలయ్యే పరిస్థితి నెలకొంది. 30 శాతం వరకూ కోతలు జరగ్గా మిగతా పంట అంతా పొలంపైనే ఉంది. పొలంపై ఉన్న వరిపంటను రక్షించుకోవడానికి రైతులు వరి పనలను చిన్న చిన్న దిబ్బలుగా పెడుతున్నారు. భారీ వర్షాలు కురిస్తే మొత్తం పంట నీట మునిగి పాడవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బోనిలో ఆరుబయటే ధాన్యం నిల్వలు

మండలంలోని బోని గ్రామంలో యంత్రాలతో నూర్చిన ధాన్యాన్ని రైతులు ఆరుబయటే ఆరబెట్టారు. కాగా తుపాను ప్రభావంతో వర్షం కురుస్తుండంతో పరదాలు కప్పి రక్షించుకోవడానికి పాట్లు పడుతున్నారు. బోని రైతు భరోసా కేంద్రం వద్ద విశాలమైన ఖాళీ ప్రాంతం ఉండడంతో నూర్చిన పంటను ఆరుబయటే ఎండబెట్టారు. ఆ ప్రాంతం లోతట్టు కావడంతో వర్షం ఎక్కువైతే ధాన్యం పూర్తిగా తడిచిపోయే ప్రమాదం ఉందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది రైతులు పొలంలోనే ధాన్యాన్ని ఆరబెట్టారు. వాటి చుట్టూ ఇప్పటికే నీరు చేరిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా మిచాంగ్ తుఫాను ప్రభావం అన్నదాతకు కునుకు లేకుండా చేస్తోంది.

మిచాంగ్‌తో నేలకొరిగిన వరి

తగరపువలస: మిచాంగ్ తుపాను ప్రభావంతో ఆదివారం రాత్రి నుంచి తీవ్రమైన గాలులు, సోమవారం నుంచి కురుస్తున్న వర్షాలకు చివరి దశలో ఉన్న వరి పైరు నేలవాలింది. భీమిలి డివిజన్‌లో వందలాది ఎకరాల్లో పంట కోతకు వచ్చే దశలో తుపాను నష్టం కలిగించిందని రైతులు అంటున్నారు. మంగళవారం వరకు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పంటకు ఎంత నష్టం వాటిల్లుతుందోనని ఆందోళన చెందుతున్నారు. మరోవైపు పూలతోటలు, కూరగాయల పంటలకు కూడా నష్టం వాటిల్లనుందని ఉద్యానవన రైతులు అంటున్నారు. భీమిలి మండలం కొత్త మూలకుద్దులో ఉప్పు సీజన్ ఆరంభంలోనే వర్షాలతో కూడిన తుపాను ఇక్కడి రైతుల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. రెండు మాసాలుగా ఇక్కడి రైతులు ఉప్పు సాగు కోసం పెట్టుబడులు పెట్టి సిద్ధం చేసిన మడులు నీళ్లతో నిండిపోయాయి. వర్షం తెరిపిచ్చిన తర్వాత మడుల నుంచి నీటిని బయటకు వదిలి ఆరబెట్టడానికి 15 రోజుల సమయం పడుతుందని ఉప్పు సాగు లీజుదారులు అంటున్నారు. తుపాను కారణంగా చిరువ్యాపారాలు మందగించాయి.

రైతులకు అధికారుల సూచనలు

తుపాను ప్రభావం కారణంగా భీమిలి వ్యవసాయాధికారి బి.శివకోమలి సోమవారం సంగివలస, తాటితూరు, టి.నగరపాలెం గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 3 నుంచి తుపాను కారణంగా వరి పంట కోతలు వాయిదా వేసుకోమని రైతులకు సూచించినట్టు తెలిపారు. ఇప్పటికే పంట కోత జరిగితే పనలను చిన్న కుప్పలుగా పెట్టుకోవాలని సూచించామన్నారు. వీటిని ఆమె పరిశీలించి రైతులతో మాట్లాడారు.

పద్మనాభం: తుపాను ప్రభావంతో రైతులు వరి పంటను కాపాడుకోవడానికి అపసోపాలు పడుతున్నారు. మండలంలోని మద్ది, బాందేవుపురం, కృష్ణాపురం గ్రామాల్లో వరి కోతలు పూర్తయ్యాయి. తుపాను భయంతో కొంతమంది పొలంలో గాలి దిబ్బలు పెట్టారు. మరి కొంతమంది నూర్చిన ధాన్యాన్ని తప్పని పరిస్థితుల్లో మడిలోనే ఉంచి తార్పాలిన్లు కప్పారు. వర్షానికి పొలంలో నీరు చేరడంతో ధాన్యం కూడా తడిసిపోయే ప్రమాదముందని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.



పొలంలోనే చిన్న చిన్న దిబ్బలుగా వరిచేను



శింగనబందలో నేలకు వాలిపోయిన వరిపంట



మద్ది గ్రామంలో తడిసిన మడిలోనే ధాన్యం నిల్వ



సంగివలసలో ఏవో శివకోమలి, తదితరులు

9 నుంచి కులగణన సర్వే

భీమునిపట్నం: భీమిలి మండల పరిధిలో ఈ నెల 9 నుంచి కుల గణన సర్వే జరుగుతుందని జిల్లా పంచాయతీ అధికారి ఎంవీపీ శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయాల సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది రోజులపాటు సర్వే జరుగుతుందని, దీనిపై ఉన్నతాధికారుల సూచనలు, సలహాలను సచివాలయ సిబ్బంది పాటించాలన్నారు. వలంటీర్లు కూడా సర్వేలో పాల్గొనాలని ఆదేశించారు. సమన్వయంతో ఇంటింటికీ తిరిగి జాగ్రత్తగా సర్వే పూర్తి చేయాలని, నిర్లక్ష్యం వహించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఎంపీడీవో ఎ.లవరాజు, ఈవోఆర్డీ జి.అప్పలరాజు పాల్గొన్నారు.

యువకుడికి ఆర్థిక సాయం



చెక్కు అందిస్తున్న శ్రీరామచంద్రమూర్తి

భీమునిపట్నం: స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి సోమవారం ఒక యువకుడికి ఆర్థిక సాయం అందించారు. సమీపంలోని బ్యాంక్ కాలనీకి చెందిన కర్రి చిట్టిబాబు పాండిచ్చేరిలో జరగనున్న జాతీయ కరాటే పోటీల్లో పాల్గొనడానికి రూ.5 వేలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులు, ఇతర రంగాల్లో ప్రతిభ చూపేవారికి తమ వంతు సహకారం అందిస్తున్నామని తెలిపారు.

సీహెచ్‌సీ సూపరింటెండెంట్‌గా ప్రదీప్‌కుమార్



భీమునిపట్నం: భీమిలిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఎస్.ప్రదీప్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం పనిచేస్తున్న డాక్టర్ ఫణికుమార్ వ్యక్తిగత కారణాల వల్ల వైదొలిగారు. కాగా మత్తుమందు (ఎనస్థీషియా) డాక్టర్‌గా పని చేస్తున్న ప్రదీప్‌కుమార్‌కు ఉన్నతాధికారులు సూపరింటెండెంట్‌గా బాధ్యతలు అప్పగించారు.

తుపాను సహాయక చర్యల్లో అధికారులు నిమగ్నం



తుపాను ప్రభావంతో రుషికొండ తీరంలో ఎగసిపడుతున్న అలలు



నమ్మివానిపేట మామిడితోటలో జీవీఎంసీ, రెవెన్యూ విభాగాల అధికారులు

తగరపువలస: తుపాను కారణంగా జీవీఎంసీ భీమిలి జోన్, రెవెన్యూ అధికారులు సోమవారం పల్లపు ప్రాంతాల్లో పర్యటించారు. ఊళ్లపేట, నమ్మివానిపేట, ఆదర్శనగర్‌లో పూర్తిస్థాయిలో డ్రైనేజీలు లేకపోవడంతో ముంపునకు గురైన ప్రాంతాలను గుర్తించారు. ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్న వారిని గుర్తించారు. ఇళ్ల మధ్య నిలిచిన నీటిని మళ్లించడానికి తాత్కాలికంగా అడ్డంగా ఉన్న గోడలను కూల్చి డ్రైనేజీని తవ్వించారు. ఆదర్శనగర్‌లో నీటిని నమ్మివానిపేట రహదారి పక్క నుంచి ఎర్ర కోనేటికి తరలించారు. ఈ సహాయక కార్యక్రమాల్లో భీమిలి తహసీల్దార్ రమేష్, జెడ్సీ బి.రాము, ఏసీపీ దవళ శ్రీనివాస్, ఏఈ సుమన్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.కరుణాకరరెడ్డి, వంశీరెడ్డి, జగన్నాథ ఎల్లాజీ, కంచుబోయిన వెంకటరావు, చెట్ల నరసింగరెడ్డి, చెట్ల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

కొమ్మాది: తుపాను ప్రభావంతో తీర ప్రాంతాలకు ఆనుకుని ఉన్న నివాసాల్లోని మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని జోన్ – 1 జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము సూచించారు. సోమవారం జీవీఎంసీ 4వ వార్డు బీచ్‌రోడ్డు మంగమారిపేటలో మత్స్యకార ప్రాంతాల్లో కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబుతో కలిసి పర్యటించారు. మంగళవారం తుపాను తీరం దాటే క్రమంలో ఈదురుగాలులు, భారీ వర్షం కురుస్తుందని, జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. వాతావరణ పరిస్థితి చూసుకుని ఆ కేంద్రానికి వెళ్లాలని కోరారు. అదేవిధంగా బలమైన గాలులు వీస్తాయని, పడవలు, వలలు సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని సూచించారు. రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. దూడ అప్పారావు, మేరుగు చిన్నారావు తదితరులు ఉన్నారు.

- రుషికొండ, సాగర్‌నగర్, మంగమారిపేట, ఉప్పాడ, భీమిలి తీర ప్రాంతాల్లో సముద్రం అల్లకల్లోలంగా మారింది. రుషికొండ, సాగర్‌నగర్ బీచ్ కోతకు గురైంది. భీమిలి తీర ప్రాంతానికి ఆనుకుని ఉన్న తోటవీధిలోని మత్స్యకారులను జెడ్సీ బొడ్డేపల్లి రాము అప్రమత్తం చేశారు. పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని సూచించారు.

భీమునిపట్నం: నిస్సహాయ స్థితిలో ఉన్న వృద్ధురాలిని సచివాలయ సిబ్బంది సోమవారం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పికొండవీధి వద్ద ఒక పూరి గుడిశలో పైల అచ్చియ్యమ్మ (85) నివసిస్తోంది. తుపాను ప్రభావంతో వర్షం కురుస్తుండడంతో గుడిశ సగానికిపైగా కూలిపోయింది. విషయం తెలుసుకున్న అప్పికొండ వీధి సచివాలయ అడ్మిన్ కృష్ణవేణి, సిబ్బంది అక్కడకు వెళ్లి అచ్చియ్యమ్మను 108 వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన సాధ్యం



తునివలసలో పథకాల ఫ్లెక్సీ ఆవిష్కరిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ గిరిబాబు, తదితరులు



తర్లువాడలో సంక్షేమ పథకాల ఫ్లెక్సీ ఆవిష్కరిస్తున్న నాయకులు

పద్మనాభం : సంక్షేమ పథకాల కొనసాగింపునకు ఆంధ్రప్రదేశ్‌కు సీఎం జగన్ మోహన్‌రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమంలో భాగంగా మండలంలోని తునివలసలో సోమవారం ఆయన మాట్లాడారు. పార్టీలతో సంబంధం లేకుండా అర్హతనే ప్రామాణికంగా తీసుకుని సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం సచివాలయం వద్ద సంక్షేమ పథకాల ఫ్లెక్సీ ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ జెండా ఎగుర వేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి సుంకర బంగారప్పడు, తునివలస ఎంపీటీసీ సభ్యుడు కిలారి సూర్యనారాయణ, ఈవోఆర్డీ కుమార్, పంచాయతీ కార్యదర్శి రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై విస్తృతంగా ప్రచారం

ఆనందపురం : సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం సూచించారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం మండలంలోని తర్లువాడలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల వారిని ఆదుకోవడానికి రైతు భరోసా, జగనన్న కాలనీలు, చేయూత, అమ్మ ఒడి, విద్యా దీవెన వంటి ఎన్నో పథకాలను ప్రభుత్వం అమలు జరుపుతోందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిపై ప్రచారం చేసి మరలా ప్రజల మద్దతు కోరాలన్నారు. మరలా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సీఎం అయితేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని వివరించారు. ఈ సందర్భంగా పార్టీ జెండా, అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలతో కూడిన ఫ్లెక్సీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, నాయకులు మజ్జి రమేష్ నాయుడు, బాలి అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ: వర్షాన్ని సైతం లెక్కచేయకుండా 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని జీవీఎంసీ 6, 7 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం ఉత్సాహంగా నిర్వహించారు. చంద్రంపాలెంలో వార్డు సచివాలయం సమీపంలో వైఎస్సార్‌సీపీ పతాకాన్ని పిళ్లా సూరిబాబు ఎగురవేయగా సంక్షేమ పథకాల బోర్డును సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలకు ఏం కావాలో తెలుసుకుని సచివాలయాల ద్వారా సీఎం జగన్ అందించారన్నారు. విశాఖ వాసులకు పరిపాలన రాజధానిని కూడా ఇస్తున్నారని చెప్పారు. ప్రజా సంక్షేమ ప్రభుత్వం మరలా కావాలంటే సీఎం జగన్‌నే మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. చేకూరి రజని, పీవీజీ అప్పారావు, పిళ్లా అప్పన్న, జగ్గుపిల్లి నరేష్, సీస రామారావు, జగ్గుపిల్లి అప్పారావు, పోతిన జోగి పాల్గొన్నారు.

- జీవీఎంసీ 6వ వార్డు బక్కన్నపాలెం 42వ నంబరు సచివాలయంలో జీసీఎస్ కన్వీనర్ గాదే రోసిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి బొట్ట అప్పలరాజు వైఎస్సార్ సీపీ జెండా, సంక్షేమ పథకాల బోర్డులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పోతిన మూర్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



చంద్రంపాలెంలో పతాకావిష్కరణలో నాయకులు



గృహ సారథులకు కిట్లు అందజేస్తున్న నాయకులు

మార్మోగిన శివనామస్మరణ



పూజలందుకున్న శివయ్య



మానం ఆంజనేయులు కాలనీలోని మహా కామేశ్వర స్వామి



సిద్ధేశ్వర పీఠంలో స్వామి వారు

కొమ్మాది: కార్తీకమాసం మూడో సోమవారం శివాలయాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. వేకువజాము నుంచే శివయ్యను పూజించేందుకు భక్తులు బారులు తీరారు. బీచ్‌రోడ్డు హంసవనం పుణ్యక్షేత్రం రామాద్రిలో, ఎండాడ, రుషికొండ, మారికవలస శివాలయాల్లో భక్తులు పంచామృతాభిషేకాలు నిర్వహించి, దీపారాధన చేశారు.

భీమునిపట్నం: స్థానిక చోడేశ్వర స్వామి ఆలయానికి కార్తీక సోమవారం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. ఉదయం నుంచి వర్షం కురుస్తున్నా భక్తులు ఆలయానికి విచ్చేసి స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు సుబ్రహ్మణ్యం ప్రత్యేక పూజలు చేశారు.

మధురవాడ: మిథిలాపురి వుడా కాలనీలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఈవో నగేష్, మధురవాడ ఐటీ సెజ్ కూడలి వద్ద గల మానం ఆంజనేయులు కాలనీలోని శ్రీ లలితా త్రిపుర సుందర సమేత మహా కామేశ్వర స్వామి ఆలయంలో కమిటీ అధ్యక్షుడు బొడ్డేపల్లి సురేష్, మధురవాడ కూడలి సిద్ధేశ్వర స్వామి పీఠంలోని ఆలయంలో ధర్మకర్త నరసింహమూర్తి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు దూసి రామలింగ స్వామి ప్రత్యేక పూజలు చేశారు.

పీఎం పాలెం: జీవీఎంసీ 6వ వార్డులోని కార్‌షెడ్ కూడలి బబ్బేలమ్మ ఆలయంలో గల శ్రీ కాశీ ఉమా మహేశ్వర స్వామికి, శృంగేరి పీఠంలోని శివాలయాల్లో అభిషేకాలు, అర్చనలు చేశారు. తుపాను కారణంగా ఆలయాలకు వెళ్లడానికి భక్తులు ఇబ్బందులు పడ్డారు.

కార్తీక సోమవారానికి తుపాను ఎఫెక్ట్

తగరపువలస: కార్తీకమాసం మూడో సోమవారంపై తుపాను ప్రభావం కనిపించింది. వేకువజాము నుంచి చల్లటి గాలులతో కూడిన వర్షం కారణంగా రద్దీగా ఉండాల్సిన శివాలయాల్లో భక్తుల సంఖ్య తగ్గిపోయింది. కార్తీక నోములు ఆచరించేవారు ప్రత్యేక పూజలకు హాజరయ్యారు. పలు ఆలయాల వద్ద భజనలు, దీపోత్సవాలు నిర్వహించారు. ఆలయాల కమిటీ ప్రతినిధులు భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. కొండపేట సంతోషిమాత ఆలయ ప్రాంగణంలోని భవానీ శంకర ఆలయంలో ద్వాదశ జ్యోతిర్లింగాలు ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నాయని ఆలయ ప్రతినిధి బొడ్డు నరసింగరావు తెలిపారు. దాతల సహకారంతో వీటిని త్వరలో ప్రతిష్టించనున్నట్టు ఆయన తెలిపారు.



శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు



ప్రతిష్టాపనకు సిద్ధం చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాలు

ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు వినతి



పార్కు పరిరక్షణపై జెడ్సీకి వివరిస్తున్న నాయకులు

మధురవాడ: పార్కు స్థలం పరిరక్షణ కోసం జీవీఎంసీ కమిషనర్ ఇచ్చిన ఆదేశాలను స్థానిక సిబ్బంది అమలు చేయడం లేదని, జోనల్ స్థాయిలో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారుల్లో చలనం ఉండడం లేదని 8వ వార్డు బింద్రానగర్ కాలనీ అసోసియేషన్ నాయకులు సాగర్, తదితరులు ఆరోపించారు. మధురవాడ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'స్పందన'లో జెడ్సీ కనకమహాలక్ష్మి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పలు సమస్యలపై 7 అర్జీలు వచ్చాయి. 6వ వార్డు రేవళ్లపాలెంలో మాస్టర్ ప్లాన్ రోడ్డు ఆక్రమణపై చర్యలు చేపట్టి 60 అడుగుల రోడ్డును పునరుద్ధరించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు పిళ్లా రమణబాబు కోరారు. మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నంబరు 214, 219లోని సాయి గణేష్‌కాలనీతోపాటు పరిసర ప్రాంతాలకు చెందిన 60 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డులో రాకపోకలకు ఇబ్బందులు కలుగజేస్తున్నారని ఫిర్యాదు చేశారు. అర్జీలపై తక్షణ చర్యలు చేపడతామని జెడ్సీ హామీ ఇచ్చారు.

'స్పందన'కు 9 వినతులు

భీమునిపట్నం: స్థానిక జోనల్ కార్యాలయంలో జెడ్సీ బొడ్డేపల్లి రాము ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 'స్పందన'కు 9 వినతులు వచ్చాయి. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి ఆరు, ప్రజారోగ్యానికి మూడు వినతులు రాగా, వాటిని పరిశీలించి త్వరలో పరిష్కరిస్తామని జెడ్సీ తెలిపారు.